అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 231. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ ఆదివారం.01.06.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం..

భువనగిరి:అమృత్ తెలంగాణ: యువత పొగత్రాగుడుకు బానిసలు కాకూడదని, వారి శక్తి, విజ్ఞానం దేశ సంపదని, సరదాగా అలవాటు చేసుకుంటే అది ఒక వ్యసనం లాగ మారి ప్రాణాన్ని, జీవితాన్ని ఛిద్రం చేస్తుందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్చార్జ్ అధ్యక్షులు ముక్తిదా తెలిపారు. శనివారం భువనగిరిలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం పురస్కరించుకొని అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బహిర్గత ధూమపానం నిషేధింపబడిందని, దీనిని అతిక్రమిస్తే రాజ్యాంగం ప్రకారం స్వేచ్ఛా హక్కును కాలరాయటమే అని తెలిపారు. పొగాకును అందరు విడనాడాలని దీనిని మాన్పించటంలో అందరు కృషి చేయాలి అని తెలిపారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ మరియు ఇంచార్జి కార్యదర్శి ఎన్. శ్యామసుందర్ మాట్లాడుతూ పొగ త్రాగటం ఒక మానసిక రుగ్మతన్నారు. దీనిని మానివేయాలంటే తమకు తామే కౌన్సిలింగ్ చేసుకొని పొగ త్రాగే అలవాటు స్వయంగా మానుకోవాలన్నారు.

## ఎనిమిది మంది దళ సభ్యులు లొంగుబాటు

ములుగు :అమృత్ తెలంగాణ: జిల్లాలో ఎనిమిది మంది మావోయిస్టులు లొంగిపోయినట్టు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న "పోరు కన్నా ఊరు మిన్న, మన ఊరికి తిరిగి రండి" కార్యక్రమం ద్వారా లొంగిపోయిన దళ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయాల గురించి తెలుసుకుని వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఎనిమిది మంది మావోయిస్టు పార్టీ సభ్యులు జనజీవన స్రవంతిలో కలవడానికి ముందుకు వచ్చారని అన్నారు. వారిలో డివిజనల్ కమిటీ సభ్యుడు, ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు ముగ్గురు పార్టీ సభ్యులు , ఇద్దరు మిలిషియా సభ్యులు ఉన్నారని తెలిపారు. వారికి ఒక్కొక్కరికి రూ.25 వేల రివార్డు అందించామని అన్నారు. ఇందులో నలుగురు గెరిల్లా యుద్ధ నైపుణ్యంతో కూడిన సాయుధ దళాల్లో పనిచేశారని చెప్పారు. ఈ సంవత్సరం జనవరి నుండి రాష్ట్రంలో ఇప్పటివరకు 355మంది అజ్ఞాత మావోయిస్టులు లొంగిపోయారని అన్నారు.

# జూన్ 10న భారత్ బంద్..




హైదరాబాద్: అమృత్ తెలంగాణ:ఆపరేషన్ కగార్ లో భాగంగా ఇటీవల తెలంగాణ – ఛత్తీస్ గఢ్ సరిహద్దు జిల్లాల్లో జరిగిన ఎన్ కౌంటర్ లో 27 మంది మావోయిస్టులను భారత బలగాలు ఎన్ కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. మావోల కీలక నేత నంబాల కేశవరావు మృతికి నిరసనగా జూన్ 10న భారత్ బంద్ కు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. అదేవిధంగా జూన్ 11 నుంచి ఆగస్టు 3 వరకు అమర వీరుల స్మారక సభలను నిర్వహించనున్నట్లుగా వెల్లడించారు. 2024 నుంచి ఇప్పటి వరకు 540 మంది మావోయిస్టులు భద్రతా దళాలు జరిపిన ఎదురుకాల్పుల్లో మృతి చెందారని వారు తెలిపారు. తాము శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా.. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ను ఆపడం లేదని అన్నారు. గత రెండు నెలలుగా సంయమనం పాటించామని, కేంద్ర రాష్ట్ర ఫాసిస్ట్ వైఖరికి నిరసనగా జూన్ 10న భారత్ బంద్ కు పిలుపునిస్తున్నామని మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ నేడు లేఖను విడుదల చేశారు.

# మిస్ వరల్డ్-2025 విజేతగా థాయ్‌లాండ్ సుందరి



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: మిస్ వరల్డ్- 2025 విజేతగా థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్ నిలిచారు. మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా 72వ ప్రపంచ సుందరికి కిరీటాన్ని ఆమెకు ధరించారు. 3వ రన్నర్ అప్ గా మిస్ మార్టినిక్, 2వ రన్నర్ అప్‌గా మిస్ పోలాండ్, 1వ రన్నర్ అప్‌గా మిస్ పోలెండ్ నిలిచారు. ఈ అందాల భామకు రూ.8.5 కోట్ల ప్రైజ్ మనీ అందనుంది.

# బీజేపీ- బీఆర్ఎస్ ఒప్పందం కవిత బట్టబయలు



ఖమ్మం.అమృత్ తెలంగాణ: 'బీజేపీ– బీఆర్ఎస్ వేర్వేరు కాదు. కవిత ఇష్యు కల్వకుంట్ల కుటుంబ కుంపటి. ఆస్తి పంపకాల్లో తేడాలు వచ్చి రోడ్డున పడ్డారు. ఇకమీదట రాజకీయ ముఖచిత్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉండదు. కవిత చెప్పిన కొన్ని విషయాలు వాస్తవాలే. బీజేపీ– బీఆర్ఎస్ ఒప్పందాన్ని కవిత బయట పెట్టింది. వీటికి బీఆర్ఎస్ – బీజేపీ నాయకత్వం జవాబు చెప్పాలి. కేంద్ర మంత్రి బండి సంజరు ఇంకా యువ మోర్చా నాయకుడిలాగా మాట్లాడుతున్నారు. ముందు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వేసిన ప్రశ్నలకు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి' అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసాని వద్ద శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఆదివాసీ నాయకుల శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందిరా గాంధీ మొదలు రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ పార్టీ గిరిజన, ఆదివాసీ హక్కులను కాపాడుతూనే ఉందన్నారు. లంబాడ, కోయ, గోండులను ఆదుకోవాలనే ధ్యేయం కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. అందుకే ఆదివాసీ శిక్షణా తరగతులను ఏర్పాటు చేశామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి అభివృద్ధి, సంక్షేమంలో స్పష్టత ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుందన్నారు. బీజేపీ పదేండ్లుగా అధికారంలో ఉన్నా అవినీతిని ఆపలేకపోయిందన్నారు. బీజేపీ కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యిందన్నారు. బీజేపి– బీఆర్ఎస్ లోపాయికార ఒప్పందంతో ప్రజా ధనాన్ని దోపిడీ చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, మహబూ బాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, కోరం కనకయ్య, మట్టా రాగమయి, రాందాస్ నాయక్, తదితరులు హాజరయ్యారు.

# జూన్ 4న రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళనలు : ఎమ్మెల్సీ కవిత




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావడం మన గ్రహచారం అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బంజారాహిల్స్‌లో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. "మన ఖర్మేందంటే ప్రస్తుత ముఖ్యమంత్రి జై తెలంగాణ అని కూడా అనరు. మన గ్రహచారం బాగోలేక రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారు. ఉద్యమకారులపైకి గన్ పట్టుకుని వెళ్లిన వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం వస్తోంది ఆ రోజైనా అమరవీరులకు ముఖ్యమంత్రి నివాళు లర్పించాలి. రేవంత్‌రెడ్డి.. పక్క రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేస్తున్నారు. పక్క రాష్ట్రం ప్రాజెక్టులు కడుతుంటే.. ఏం చేస్తున్నారు." అని నిలదీశారు. "జూన్ 2 రాజీవ్ యువ వికాసం పేరుతో పథకం ప్రారంభిస్తున్నారని తెలిసింది. పథకాలు.. తెలంగాణ యువ వికాసం పేరుతో ఉండాలి కానీ.. రాజీవ్ వికాసం పేరు మీద కాదు. తెలంగాణ కోసం పోరాడి.. రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తికి నోటీసులిస్తారా? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు నోటీసు ఇస్తారా? కేసీఆర్‌కు నోటీసు ఇవ్వడంపై జూన్ 4న పెద్ద ఎత్తున రాష్ట్రంలో ఆందోళనలు చేపడుతున్నాం." అని కవిత తెలిపారు. శనివారం సాయంత్రం తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్సీ కవిత ప్రారంభించారు. బంజారాహిల్స్‌లోని నూతన కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కవిత వెంట భర్త ఉన్నారు. భర్తతో కలిసి ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతన కార్యాలయంలో కేసీఆర్, కవిత ఫొటోలు ప్రత్యేకంగా పెట్టారు. ఇక తెలంగాణ జాగృతి బ్యానర్‌లో ప్రొఫెసర్ జయశంకర్, కేసీఆర్ చిత్రాలు ఉన్నాయి. అలాగే కార్యాలయంలో బీఆర్. అంబేద్కర్, జయశంకర్, తెలంగాణ తల్లి, జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పులే విగ్రహాలతో పాటు అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు.

# అమెరికా దుర్మార్గాన్ని ఎండగట్టాలి




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: అమెరికా దుర్మార్గాలను ఎండగడుతూ పాలస్తీనాకు అండగా నిలబడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్ కేంద్ర ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో పీపుల్స్ సాలిడారిటీ ఫర్ పాలస్తీనా ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశం అనేక సంవత్సరాలుగా పాలస్తీనాకు మద్దతుగా నిలుస్తున్నదని గుర్తుచేశారు. ప్రస్తుతం అక్కడి ప్రజలకు మంచినీరు, ఔషధాలు వంటి నిత్యావసర వస్తువులు కూడా అందకుండా ఇశ్రాయేల్ చేస్తున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. బతకడానికి అవసరమైన వాటిని వారి నుంచి లాక్కుంటూ మానవ విలువలకు, యుద్ధ నియమాలకు వ్యతిరేకంగా ఇశ్రాయేల్ దాడులు చేస్తున్నదని విమర్శించారు. సాక్షాత్తు ఇశ్రాయేల్ మంత్రుల్లో ఒకరు, పాలస్తీనాలో పిల్లలు కూడా తమ శతవులే అంటున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో అర్థం చేసుకోవచ్చన్నారు. పాలస్తీనాకు సుదీర్ఘకాలం మద్ధతుగా నిలబడిన భారతదేశంలో నేటి పాలకులు ఇశ్రాయేల్ దుర్మార్గ దాడిని అన్యాయంగా భావించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల గురించి అనేక నీతులు మాట్లాడే అమెరికా పాలస్తీనాలో మహిళలు, పిల్లలతో సహా అన్ని రకాల హక్కుల హననం జరుగుతుంటే మౌనంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపెచ్చు గాజాను ఆక్రమించుకునేంతగా చేసిన ప్రకటన ఆ దేశానికి పెరిగిన సామ్రాజ్యవాద కాంక్షకు తార్కాణమని తెలిపారు. మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ నాయకులు అజీజ్‌పాషా మాట్లాడుతూ పాలస్తీనాలో 20 లక్షల మందిని చుట్టుముట్టి ఇష్టానుసారంగా బాంబులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి ప్రమాదకర పరిస్థితిని ఎప్పుడు చూడలేదని తెలిపారు. యుద్ధ నేరాల కింద విచారణ జరపాలనీ, ఇండియా ఇశ్రాయేల్‌ను వదిలి మునపటిలాగే పాలస్తీనాకు మద్ధతుగా నిలబడాలని కోరారు. టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఇశ్రాయేల్‌కు తన ప్రజలను కాపాడుకునే సర్వాధికారాలు ఉన్నాయన్నారు. అయితే గాజా, వెస్ట్‌బ్యాంక్ నుంచి పాలస్తీనియన్లను తరిమి ఆక్రమించుకోవాలనుకోవడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఆస్పత్రులు, పాఠశాలలు, ఆవాస ప్రాంతాలపై దాడులు ఏ మాత్రం సమంజసం కాదని తెలిపారు. ఈ పరిస్థితి చక్కబడేలా ప్రపంచమంతా ఖండించాలనీ, ఆ దిశగా ప్రయత్నించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. పాలస్తీనా స్వయం నిర్ణయాధికారాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ యుద్ధాల నివారణ, శాంతి పరిరక్షణ, మానవ హక్కులను కాపాడే ప్రధాన ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి ఏర్పాటైందని గుర్తుచేశారు. పాలస్తీనాలో సైనికుల మధ్య యుద్ధం జరగడం లేదనీ, ఇశ్రాయేల్ పాలస్తీనా ప్రజలను చుట్టుముట్టి చంపేస్తున్నదనీ, ఇక మానవ హక్కులేవని ప్రశ్నించారు. ఐక్యరాజ్య సమితిలో ఈ అంశాన్ని లేవనెత్తి పాలస్తీనీయులకు న్యాయం జరిగేలా ప్రయత్నించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సామాజిక కార్యకర్త శారా మాథ్యూస్ మాట్లాడుతూ టర్కీ లాంటి దేశాలు ఇశ్రాయేల్‌తో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేస్తున్నాయని తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీ పాలస్తీనాకు న్యాయం జరగాలని కోరుకుంటున్నదనీ, అదే క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇశ్రాయేల్‌తో ఎలాంటి ఒప్పందాలు చేసుకోవద్దని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా తమీర్ మిల్లట్ ప్రధాన కార్యదర్శి ఒమర్ అహ్మద్ షరీఫ్, అడ్వొకేట్ డాక్టర్ ఇస్మాయిల్, పీపుల్స్ సాలిడారిటీ ఫర్ పాలస్తీనా కన్వీనర్ మొహమ్మద్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ ప్రయోజనాల పెంపును స్వాగతిస్తున్నాం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలను, 65 ఏండ్లకు ఉద్యోగ విరమణ వయస్సును పెంచడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) ప్రకటించింది. అయితే, 2024 జూలై ఒకటో తేదీ నుంచి రిటైర్డ్ అయిన ప్రతి ఒక్కరికీ ఇది వర్తింపజేయాలని కోరింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీచర్లకు రిటైర్డ్ బెనిఫిట్స్‌ను లక్ష రూపాయల నుంచి రూ.2 లక్షలకు, హెల్పర్లకు రూ.50 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచడం శుభపరిణామం అన్నారు. తమ యూనియన్ నిరంతర పోరాటాల ద్వారానే ఈ విజయం సాధ్యమైంద న్నారు. డైరెక్టరేట్ ముందు ధర్నా జరిగిన సమయంలో రిటైర్డ్ బెనిఫిట్స్ పెంచుతామనీ, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామనీ, 2024 జూలై ఒకటి తర్వాత రిటైర్డ్ అయ్యే టీచర్లు, హెల్పర్లకు ఈ సౌకర్యాలు వర్తింపజేస్తామని డైరెక్టర్ ఇచ్చిన హామీని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో 2024 జూలై ఒకటో తేదీ నుంచి విధుల నుంచి తొలగించబడ్డ అంగన్‌వాడీటీచర్లు, హెల్పర్లందరీ రిటైర్డ్ బెనిఫిట్స్ వచ్చేలా జీవోను సవరించాలని కోరారు.

# క్షేత్రస్థాయి సిబ్బంది పారదర్శకంగా ఉండాలి..!



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అవినీతి జరుగుతోందంటూ వచ్చిన ఆరోపణలపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలని క్షేత్రస్థాయి అధికారులకు మంత్రి సూచించారు. జీఎస్టీ నంబర్‌ను పొందేందుకు తాను అవినీతికి పాల్పడబోతున్నానంటూ వినోద్ గుప్తా అనే వ్యక్తి లింక్డిన్‌లో పోస్టు చేశారు. తన భార్య, కుమార్తె కలిసి నెలకొల్పిన సంస్థకు జీఎస్టీ నంబర్ కోసం తాను దరఖాస్తు చేశానని పేర్కొన్నారు. 20 రోజులు దాటినా నంబర్ రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మరోమార్గం లేక జీఎస్టీ నంబర్ పొందడం కోసం తాను లంచం ఇవ్వనున్నట్టు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వినోద్ గుప్తా పోస్టును స్క్రీన్‌షాట్ తీసి సీబీఐసీని ట్యాగ్ చేస్తూ ట్యాక్స్ నిపుణులు అభిషేక్ రాజారామ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇది కాస్త వైరల్‌గా మారింది. దీనిపై మంత్రి స్పందించాల్సి వచ్చింది.

# శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి,.

**పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారిని ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్.**





నిర్మల్ మే 31 ( అమృత్ తెలంగాణ )నిర్మల్ జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ శనివారం రోజు పదవీ విరమణ పొందిన అంబా రావు నీ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఏ. ఆర్ హెడ్ కానిస్టేబుల్ అంబా రావు జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ ముఖ్యలయం లో 40 సంవత్సరాలు పూర్తిచేసుకుని శనివారం రోజు పదవి విరమణ పొందటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా .జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘంగా సర్వస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేస్తు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ పత్రాలు అందచేశారు. సిబ్బంది సేవను మరువమని, పదవీవిరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించ వచ్చని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురైయిన అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు రిటైర్ మెంట్ కేవలం తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదు అని కొనియాడారు.


## పదవి విరమణ పొందిన పోలీస్ అధికారిని సన్మానించిన ఎస్పీ జానకి షర్మిల

అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ

విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా, పిల్లలకు దూరంగా ఉండి విధులు నిర్వహించినారు. పదవి విరమణ చేసిన పోలీసులు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు. అత్యవసరం అయినప్పుడు రిటైర్డ్ అయిన పోలీస్ అధికారుల సేవలు వినియోగించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏ.ఓ యూనిస్ అలీ, ఆర్.ఐ లు రాం నిరంజన్ రావు, శేఖర్, రమేష్, సి.సి శ్రీనివాస్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అంబారావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ లో వికసించిన మే పుష్పం ఏడాదిలో ఒక్కసారే వికసించే పువ్వు

**15 రోజులు ఆలస్యంగా వికసించిన పుష్పం చూడటానికి భారీగా వస్తున్న జనాలు.**





మే మాసంలో వికసించే పుష్పం మే పుష్పం

నిర్మల్ మే 31 ( అమృత్ తెలంగాణ ) ప్రతి ఏటా మే నెలలో ప్రకృతి ప్రియులను అలరించే మే పుష్పం నిర్మల్ పట్టణ కేంద్రంలో వికసించింది. ఏడాదిలో ఒక్కసారే వికసించే ప్రకృతి ప్రియులను ఆకట్టుకుంటుంది. మే మాసం రాగానే ఈ పుష్పం కోసం అనేక మంది ప్రకృతిని ఆస్వాదించే వారు ఆసక్తిగా ఎదురు చూస్తారు. నిర్మల్ పట్టణ కేంద్రంలోని భాగ్యనగర్ లో డాక్టర్ ఉమేష్ గుప్తా సుజాత దంపతుల నివాసంలోని పెరటిలో ఈ పుష్పం తాజాగా పూసింది. ఈ అరుదైన పువ్వులు చూడటానికి ప్రజలు వారి ఇంటికి వస్తున్నారు. వాటిని ఫొటో తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం మే 15న పూసే పువ్వు ఈ సంవత్సరము మే ముప్పై ఒకటిన పూసిందని తెలిపారు.

# ఆవిర్భావ దినోత్సవ వేడుకల పనులను పరిశీలించిన మాజీ మంత్రి జోగు రామన్న





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : రెండవ తేదీన నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు... అందులో భాగంగా శనివారం కైలాస్ నగర్ లోని బి ఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లును కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. విద్యుత్ కాంతులతో పార్టీ కార్యాలయం ముస్తాబ్ చేశారు.ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేసే దిశగా గ్రామ పట్టణ లలో బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఉదయం8 గంటలకు జండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు.. అనంతరం బి ఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 9 గంటలకు జాతీయ జెండాతో పాటు బి ఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.... తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ స్వరాష్ట్రాన్ని ఏర్పరచుకొని ఉద్యమ నాయకుడు కేసీఆర్ గారి సారాధ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకుంటూ తెలంగాణ ప్రజలకు బాధ్యతాయుతమైన సంక్షేమ పథకాలు అందించడం జరిగింది అన్నారు..

# జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల కట్టడికి పటిష్ట చర్యలు

**వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తాం - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**







అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల కట్టడిలో భాగంగా అన్ని ఫర్టిలైజర్ దుకాణాలలో విస్తృత సోదాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పిడి చట్టాన్ని ప్రయోగిస్తామని అన్నారు. జిల్లాలో అన్ని పంటలకు సంబంధించి సరిపడినన్ని విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులు ఎవరు అనధికార వ్యక్తుల వద్ద విత్తనాలను కొనవద్దని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అన్ని మండలాల్లో ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని అన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులన్నీ అధికారులంతా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని పారిశుధ్య, తదితర పనులన్నీ పకడ్బందీగా నిర్వహిస్తున్నారని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ దాదాపు పూర్తి కావస్తుందని, మిగిలిన దాన్యం కొనుగోలు ప్రక్రియను అతి త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేస్తామని కలెక్టర్ ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

# సూపర్ స్టార్ కృష్ణ జన్మదిన అదిలాబాద్ జిల్లా లో వేడుకలు



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : ఆదిలాబాద్ లో సూపర్ స్టార్ "కృష్ణ మహేష్"ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు సేవ్వ జగదీష్ యాదవ్ ఆధ్వర్యంలో కృష్ణజన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీపీ గంద్రత్ రమేష్ బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు

# ఎరువుల దుకాణాల్లో తనిఖీలు..

ముధోల్ : అమృత్ తెలంగాణ:మండల కేంద్రమైన ముధోల్ లోని శ్రీ వెంకటేశ్వర సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాప్ ను శనివారం వ్యవసాయ అధికారి రచన, ఎస్ఐ బిట్ల పెర్సెస్,ఆర్ఐ నారాయణ పటేల్ లు తనిఖీచేశారు. దుకాణాల్లో స్టాక్ నిల్వ, రికార్డులను,లాట్ నంబర్ లేబుల్, ధరల పట్టిక ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని దుకాణాల్లో పూర్తిస్థాయి తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మడం కానీ,లూజు విత్త నాలు, నాణ్యతలేని విత్తనాలను అమ్మి తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల మేరకు నడుచుకోవలన్నారు. కొనుగోలు చేసిన ప్రతిరైతు రశీదు తీసుకోవాలని సూచించారు.

# శుభకార్యాలలో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ న్యూస్ : ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజకవర్గం పోచ్చార, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని నార్నూర్, ఆదిలాబాద్ టౌన్ లో జరిగిన పలు వివాహాది శుభాకార్యాలకు హాజరై నూతన వధూవరులను దీవించిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి . వారివెంట ఇచ్చోడ మండల అధ్యక్షులు ముస్కు నారాయణ రెడ్డి, గుడిహత్నూర్ మండల అధ్యక్షులు మల్యాల కరుణాకర్, నార్నూర్ మండల అధ్యక్షులు యూసుఫ్ ఖాన్, మాజీ ఎంపిటిసి కరీం, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మల్లేష్, సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి , రెండ్ల రాజన్న, విశాల్, సోషల్ మీడియా కన్వీనర్ సంతోష్ యాదవ్, సత్తర్, దస్తగిరి, షేక్ మొహమ్మద్, సయ్యద్ ఖాజా, షేక్ అహ్మద్, షేక్ జాకీర్, పోరెళ్ల మహేందర్,కాంతారావ్ దుర్గే, షేక్ ముక్రమ్ తదితరులు ఉన్నారు.

# అనుమతి ఉంటేనే నిర్మాణాలు చేపట్టాలి..

ముధోల్: అమృత్ తెలంగాణ: నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ తోపాటు మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో గ్రామ పంచాయతీల నుండి అనుమతి పొందిన ఇండ్లకే తాపీ మేస్త్రీలు నిర్మాణం పనులను చేపట్టాలని ఎంపీడీవో శివకుమార్ శనివారం తెలిపారు. గ్రామాలలో కొంత మంది గ్రామపంచాయతీల నుండి అనుమతులు లేకుండా అక్రమంగా ఇండ్లు నిర్మిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అయితే తాపీ మేస్త్రీలు సంబంధిత ఇండ్ల నిర్మాణ పనులు చేసేటప్పుడు గ్రామపంచాయతీ నుండి అనుమతి తీసుకుంటేనే నిర్మాణాల పనులను చేపట్టాలని సూచించారు. ముధోల్ లో గ్రామపంచాయతీ నుండి అనుమతి తీసుకోకుండా ఓ వ్యక్తి నిర్మాణం పనులు చేపట్టడంతో శనివారం ఆ పనులు చేస్తున్న తాపీ మేస్త్రికి పంచాయతీ కార్యదర్శి అన్వర్ నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. నూతనంగా ఇండ్లు నిర్మిస్తున్న వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కోరారు.

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి డి. అనసూయ సీతక్క నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఆయా జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు.





ఇటీవలే ప్రధాన మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా పాలనాధికారి రాజర్షి షా ను శనివారం మంచిర్యాల IDOC లో ఇంచార్జి మంత్రి సీతక్క శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

అమృత్ తెలంగాణ మంచిర్యాల కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఆయా జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు.

# మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి,ని కలిసిన కోలుర్ అన్న భావు సాటే కమిటీ సభ్యులు



నిర్మల్ జిల్లా తానూర్ మే 31 అమృత్ తెలంగాణ తానూర్ మండలం లోని కోలుర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, ద్వారా ఎస్సీ కమిటీ హాల్ కోసం మొదటగా 1 లక్ష రూపాయల ప్రొసీడింగ్ , అనంతరం 2 లక్షల ప్రొసీడింగ్ ఇవ్వడం జరిగింది. ఇప్పుడు కమిటీ హాల్ పూర్తి కావడానికి 2 లక్షల యాభై వేయిల ప్రొసీడింగ్ ఇస్తే పని పూర్తి అవుతాదని మాజీ సర్పంచ్ చంద్రకళ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉత్తం భలేరావు చెప్పడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఈ విషయాన్నీ నిర్మల్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్కలి దృష్టి కి తీసుక వెళ్లి నిధులు మంజూరు అయేలా చూస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఉత్తం భలేరావు చంద్రకళ శ్రీనివాస్ రెడ్డి కోలుర్, ధర్మేందర్ బాబు మహారాజ్ , శ్రవణ్ , దొండిబ , పుండలిక్ నాగేష్ సంజీవ్ , సాయి నాగేష్ అన్న భావు సాటే కమిటీ సభ్యులు తది తరులు పాల్గొన్నారు

# ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం నిర్వహణ.
జిల్లా పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు, ప్రజలకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ క్యాంపు.
పాల్గొన్న 15 మంది దంత వైద్యులు.
పొగాకు, గుట్కా, ఖైనీ, సిగరెట్ లాంటి టొబాకో ఉత్పత్తుల వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువ.
సిబ్బంది స్వీయ క్రమశిక్షణ ను కలిగి ఉండాలి.
వైద్య పరీక్షలను చేయించుకున్న 200 మంది సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ప్రపంచ టొబాకో నిరోధక దినోత్సవ సందర్భంగా ఈరోజు ఉదయం స్థానిక పోలీస్ హెడ్ కోటర్స్ నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారి సమక్షంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆదిలాబాద్ శాఖ వారి ఆధ్వర్యంలో ఉచితంగా పోలీసు సిబ్బందికి మరియు వారి కుటుంబ సభ్యులకు దంత వైద్య పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ టొబాకో వల్ల జీవితాలు నాశనం అవుతాయని తెలియజేస్తూ, టొబాకో మరియు వాటి ఉత్పత్తుల వినియోగం వల్ల మరియు సిగరెట్, గుట్కా, జర్దా వంటి ఉత్పత్తులు వల్ల క్యాన్సర్, గుండెపోటు, శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతాయి. సిబ్బంది స్వీయ నియంత్రణ క్రమశిక్షణను కలిగి ఉంటూ టొబాకో ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ దంత వైద్య పరీక్షలు నందు జిల్లా లోని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో 15 మంది డాక్టర్ల బృందం ఉదయం ఏడు గంటల 15 నిమిషాల నుండి వైద్య పరీక్షలను 200 మంది సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు నిర్వహించడం జరిగింది. వైద్య పరీక్షల అనంతరం వైద్యులు సూచించినటువంటి మందులను సిబ్బందికి ఉచితంగా అందజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి వారం రిమ్స్ ఆసుపత్రి రెండు నుండి మూడు వ్యక్తుల నోటి క్యాన్సర్ సర్జరీలు జరుగుతాయనే విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. యువత ప్రజలు టొబాకో ఉత్పత్తుల మోసపూరిత ప్రకటనలో, వివిధ రకాల ఫ్లేవర్లతో ప్రజలను ఆకర్షించే విధంగా ఉండే ఉత్పత్తులను తయారు చేస్తూ ఉన్నందున ప్రజలు మోసపోకుండా జాగ్రత్తలు వహిస్తూ ఉత్పత్తులను నిషేధించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సిఐ లు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్ రావు, కె ఫణిదర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు సభ్యులు డాక్టర్లు అధ్యక్షుడు: డా. జి. సాయిరామ్, ప్రధాన కార్యదర్శి: డా. చిన్మయ్ వాజే, కోశాధికారి డి. సజీవ్, సభ్యులు డాక్టర్లు దీపికా, అమూల్య, భావన, కావ్య నాయక్, ఆనంద్, సమియుద్దీన్, విశాల్ అడే, నిఖిల్ రెడ్డి, ఈ. భర్గవ్ కృష్ణ, రామకృష్ణ రెడ్డి, అరుణ్ బడవత్, రాహుల్ నాయక్ ,కిరణ్ పవార్డా, సంతోష్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఉండాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

సంఘ విద్రోహ శక్తులతో సుదీర్ఘకాలం పోరాడి పదవి విరమణ పొందిన ఇద్దరు ఏఆర్ఎస్ఐ లు.
దాదాపు 42 సం"లు పోలీసు వ్యవస్థకు సేవలందించిన ఇరువురు అధికారులు.
కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువా, పూలమాలతో సత్కరించి బహుమతి ప్రధానం చేసి అభినందించిన జిల్లా ఎస్పీ.
చేసిన సేవలను మెచ్చి రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇద్దరు అధికారులకు సేవా పథకాలను అందజేసింది.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ఒకప్పటి జిల్లా పోలీసు యంత్రాంగం ఎంతగానో సేవలందించింది, అందులో భాగంగానే జిల్లా పోలీసు వ్యవస్థలు 42 సంవత్సరముల పాటు సుదీర్ఘకాలంగా సేవలందించి మరియు జిల్లా లో సంఘవిద్రోహశక్తులతో పోరాడి జిల్లా ప్రజలకు శాంతి భద్రత రక్షణలో తన వంతు పాత్ర పోషించిన ఇద్దరు ఏ ఆర్ ఎస్ ఐ లు పదవి విరమణ పొందుతున్న సందర్భంలో, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పోలీసు ముఖ్య కార్యాలయానికి కుటుంబ సభ్యులతో ఆహ్వానించి పదవి విరమణ పొందుతున్న అధికారులను శాలువా పూలమాలలతో సత్కరించి బహుమతి ప్రధానం చేసి అభినందించారు. పదవి విరమణ పొందుతున్న అధికారులు పి భీమ్ రావు, ఎఆర్ఎస్ఐ మరియు జె గౌరయ్య ఎఆర్ఎస్ఐ లు, ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా కాపాడుకుంటూ వ్యాయామం చేస్తూ ఉండాలని తెలిపారు. జిల్లా ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ఒకప్పటి మీలాంటి పోలీసు అధికారులు చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. దాదాపు 42 సంవత్సరముల పాటు పోలీసు వ్యవస్థకు సేవలందించి ఈరోజు పదవి విరమణ పొందుతున్న అధికారులను జిల్లా ఎస్పీ చేసిన సేవలను కొనియాడి, అభినందించారు.

పదవి విరమణ పొదుతున్న అధికారుల వివరాలు.

1) పి భీమ్ రావు, ఏ ఆర్ ఎస్ ఐ, జిల్లా పోలీస్ సాయుధ కార్యాలయం. స్వగ్రామం దేవాపూర్ గ్రామం ఇంద్రవెల్లి మండలం. ఏఆర్ఎస్ఐ భీమ్ రావు గారు 1983 సంవత్సరంలో పోలీసు కానిస్టేబుల్ గా జిల్లా పోలీసు వ్యవస్థలో అడుగుపెట్టి, 2003 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్ గా, 2020 సంవత్సరంలో ఏ ఆర్ ఎస్సైగా పదోన్నతి పొందడం జరిగింది. సర్వీసులో దాదాపు 25 సంవత్సరముల పాటు సంఘవిద్ర శక్తులతో పోరాడి జిల్లా పోలీసు యంత్రం గానికి ఎనలేని సేవలందించి ఈరోజు పదవీ విరమణ పొందడం జరుగుతుంది. జిల్లా పోలీసు సాయుధ దళంలో ఎక్కువ కాలం సేవలందించిన కారణంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సేవ పథకము మరియు కఠిన సేవా పథకాలను అందించి గౌరవించింది.

2) జె గౌరయ్య, ఏ ఆర్ ఎస్ ఐ, జిల్లా పోలీసు సాయుధ కార్యాలయం. గారు ఉట్నూర్ మండలం కొత్తగూడ గ్రామానికి చెందినవారు. 1983 సంవత్సరంలో పోలీసు వ్యవస్థలో కి కానిస్టేబుల్ గా అడుగుపెట్టి, 2012 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్ గా, 2018 సంవత్సరంలో ఏ ఆర్ ఎస్సైగా పదోన్నతి పొందడం జరిగింది. ఎక్కువ కాలం బెల్లంపల్లి హెడ్ క్వార్టర్స్ నందు వివిధ అవుట్ పోస్టులలో సంఘవిద్రోహశక్తులతో పోరాటడానికి నిరంతరంగా కృషి చేసినారు. సేవలకు మెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం సేవా పథకాన్ని ప్రకటించి గౌరవించింది. గౌరయ్య గారు గత 42 సంవత్సరములుగా పోలీసు వ్యవస్థకు సేవలందించి ఈరోజు పదవీ విరమణ పొందడం జరుగుతుంది.

ఈ పదవి విరమణ కార్యక్రమంలో సిసి కొండరాజు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగమధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది కుటుంబ సభ్యుల పాల్గొన్నారు.

# అమాయకులను మోసం చేసే భూ రాక్షసులపై పంజా

అమాయకులను మోసం చేసే భూ రాక్షసులపై పంజా.
జిల్లాలో ఇప్పటివరకు 10 కేసులు నమోదు, 9 మంది ని రిమాండ్ కు తరలింపు.
ప్రజలను మోసగించి, బెదిరింపులకు పాల్పడి, చట్టంలో ఉన్న లొసుగులను వాడుకొని నేరాలకు పాల్పడుతున్న కొందరు వ్యక్తులు.
ప్రజల ఫిర్యాదులతో సరికొత్త మోసాలు బయటకు వస్తున్న వైనం
మోసం చేసే ప్రతి ఒక్కరి పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరిక.
జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : జిల్లా వ్యాప్తంగా అమాయక ప్రజలను మోసం చేస్తూ, వారి పట్ల బ్లాక్ మెయిలింగ్ లకు పాల్పడుతూ, వారి వద్ద డబ్బులు వసూలు చేసే భూ బకాసురుల పట్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా గత నెల రోజులలో ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అందిన ఫిర్యాదులలో 10 కి పైగా కేసులు నమోదు కాగా 9 మందిని ఈరోజు వరకు రిమాండ్కు తరలించి నట్టు తెలిపారు. ముఖ్యంగా అమాయక ప్రజలను కొంతమంది డాక్యుమెంట్ రైటర్ల హస్తంతో మోసం చేస్తూ డబ్బులు దండుకుంటున్నారని వారి పై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ప్రజలను మోసం చేస్తూ ఎక్కువ కాలం ముసుగులో బతకలేరని ఫిర్యాదులు వచ్చిన వెంటనే వారిపట్ల కఠినంగా వ్యవహరించవలసి వస్తుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

ఈ సందర్భంలో ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలు

1) ఈనెల 16వ తారీఖున ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో పట్టణంలోని మున్సిపాలిటీ స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని కబ్జా ప్రయత్నం చేసిన మహమ్మద్ అక్రమ్ అరెస్టు, సయ్యద్ షాబుద్దీన్ పై కేసు నమోదు.

2) ఈనెల 22వ తారీఖున ఆదిలాబాద్ టు టౌన్ పరిధిలోని మహాలక్ష్మి వాడ లో బాధితుడు ఆరే సుదర్శన్ ఫిర్యాదుతో నకిలీ పత్రాలు సృష్టించి బాధితుని స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో A1) పవర్ నవనీత్ మరియు A2) గంద్రత్ మహేందర్ లను అరెస్టు చేసి A 3) పడాల చేతన్ కుమార్ ముగ్గురిపై కేసు నమోదు చేయడం జరిగింది.

3) మే 23 ఇంద్రవెల్లి మండలంలో చట్టాలలో ఉన్న లొసుగుల ఆధారంగా నాన్ ట్రైబ్స్ లపై ఏజెన్సీలో ఇల్లు నిర్మించారనే నిజమైన కేసును వేసి వారి వద్ద నుండి డబ్బులను డిమాండ్ చేసి తీసుకోవడం జరిగిందని, బాధితుడు చెంపత రావు ఫిర్యాదుతో A1) గవందే బిపిన్ కుమార్ ఏ విపిన్ మరియు A2) మెస్రం ఆనంద్ రావు లను అరెస్టు చేసి రిమాండ్కు పంపడం జరిగింది.

4) మే 26వ తారీఖున ఇంద్రవెల్లి మండలం నందు ఏజెన్సీ ఏరియాలో ఇల్లు నిర్మిస్తున్నారనే ఫిర్యాదు చేసి, బాధితుని వద్ద నుండి ఐదు లక్షల డిమాండ్ చేసి మూడు లక్షల తీసుకొని ఫిర్యాదు వెనక్కి తీసుకోకుండా బ్లాక్ మెయిల్ కి పాల్పడిన కేసులో బాధితుడు మాణిక్చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నైతం బాలు పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగింది అని తెలిపారు.

5) మే 26వ తారీకు ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కొండూరు గంగాధర్ అనే వ్యక్తి ప్రభుత్వం ద్వారా కేటాయించబడిన ప్లాటును, అక్కడ ఇంకా దస్తావేజులు కేటాయించి, ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి తన పదవిని దుర్వినియోగం చేసిన కేసులో అరెస్టు చేయడం జరిగింది.

6) ఈనెల 26వ తారీకు మావల పోలీస్ స్టేషన్ నందు నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలను సృష్టించి ఒకే స్థలాన్ని ఇద్దరు వ్యక్తులకు అమ్మి డబ్బులు రిజిస్ట్రేషన్ చేసి మోసం చేసిన కేసులో బాధితుడు మల్లెపూల చంద్రశేఖర్ గౌడ్ ఫిర్యాదు మేరకు నిందితుడు సజ్జారపు లక్ష్మీనారాయణ ను అరెస్టు చేయడం జరిగింది.

7) ఈనెల 29వ తారీఖున ఆదిలాబాద్ రూరల్ మండలంలో కజ్జర్ల గ్రామ శివారులో 25 ఎకరాల స్థలాన్ని ఫేక్ డిపెండెంట్ సర్టిఫికెట్లను సృష్టించి కొట్టేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో తలమడుగు గ్రామ మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డిని అరెస్టు చేయడం జరిగింది.

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గారి ప్రత్యేక చొరవతో బాధితుల ఫిర్యాదుల మేరకు అక్రమార్కుల ఆటలు కట్టడి చేయడం జరుగుతుంది. అక్రమ రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్లు, చట్టలలో ఉన్న లోసగులను వాడుకొని కేసులను నమోదు చేయడం వారిని బ్లాక్ మెయిల్ చేయడం, చట్టాలను దుర్వినియోగం చేసుకోవడం, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడం, ఫేక్ డిపెండెంట్ సర్టిఫికెట్లను సృష్టించి ఆస్తులను కబ్జా చేయడం, నకిలీ పత్రాలను సృష్టించి ప్రభుత్వ యంత్రాంగాన్ని మోసం చేయడం ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై జిల్లా పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. కబ్జాదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ వారి పై కేసులు నమోదు చేస్తూ జైలు పాలు చేస్తుందని తెలిపారు. ప్రజలు అన్ని పత్రాలను సరిచూసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని హితవు పలికారు.

# ధర్మరక్షణ కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అహల్యాబాయి



నిర్మల్ జిల్లా భైంసా మే 31 అమృత్ తెలంగాణ హిందూ ధర్మ పరిరక్షణ కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి రాణి అహల్య బాయి అని భైంసా పట్టణ బిజెపి అధ్యక్షులు రావుల రాము, మండల అధ్యక్షురాలు సిరం సుష్మా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సట్ల సాయినాథ్ అన్నారు. శనివారం భైంసా పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో రాణి అహల్యా బాయి హోల్కర్ జయంతి వేడుకలను జరుపుకున్న సందర్భంగా వారు మాట్లాడారు. ఆమె చిత్రపటానికి పూజ నిర్వహించి సేవలను స్మరించుకున్నారు. 70 వేలహిందూ ఆలయాలను పునర్నిర్మించిన ఘనత ఆమెదే అన్నారు. తన రాజ్యంలోమహిళలను సైన్యాధ్యక్షులుగా నియమించారన్నారు. మహిళలు అని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో ఎన్నో కార్యక్రమాలను చేపట్టారన్నారు. అహల్య బాయి లాంటి మాతృమూర్తులను ఆదర్శంగా తీసుకొని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేడు మహిళలకు రక్షణ రంగంతో పాటు, అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు భూమేష్, మాజీ కౌన్సిలర్ గౌతమ్ పింగ్లే, మండల ప్రధాన కార్యదర్శి ఆకాష్, ఉపాధ్యక్షులు మహేందర్, సోనారి యోగేష్, కార్యదర్శి బాలాజీ పటేల్, సత్యనారాయణరెడ్డి,బండారి దిలీప్, అనిల్, రమేష్ పటేల్, గంగా ప్రసాద్,మహిళ నాయకురాలు ప్రమీల,కాసరోళ్ల ప్రవీణ్,భూకిరణ్, హన్మండ్లు, తో పాటు పలువురు పాల్గొన్నారు.

# తలమడుగు మండల కొత్తూర్ గ్రామ మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : తలమడుగు మండల కొత్తూర్ గ్రామ మాజీ సర్పంచ్ జయశ్రీ భర్త ఇంటివలె చనిపోయిన విషయం తెలుసుకున్న ఆడే గజేందర్ డిసిసిబి చైర్మన్ అడ్డి బోజరెడ్డి, మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి గారితో కలిసి వారి ఇంటికెళ్ళి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు ఆయన వెంట మాజీ ఎంపీటీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, బోథ్ నియోజవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతు రెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకన్న యాదవ్, మైనార్టీ నాయకులు సద్దాం, రామ్ రెడ్డి, రావుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ముధోల్ లో స్థల పరిశీలన..



ముధోల్ :అమృత్ తెలంగాణ: నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లో భారత్ మిషన్ లో భాగంగా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం స్థలాన్ని కంటి దవాఖానా సమీపన 260సర్వే నంబర్ లో శనివారం ఎంపీడీవో శివకుమార్, మండల సర్వేయర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ నారాయణ రావు పటేల్ పరిశీలించారు. ఈ యూనిట్ కు 20 గుంటల స్థలం అవసరం ఉన్నదని వారు తెలిపారు. దీని కొరకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 46 లక్షలు నిధులతో ఏర్పాటు చేయడం జరుగతుందని ఎంపీడీవో తెలిపారు. స్థల సేకరణ సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు పేర్కొన్నారు.

# జూన్ 1న బట్టుపల్లి శ్రీనివాస్ 14వ వర్ధంతి ..




భువనగిరి :అమృత్ తెలంగాణ: సీపీఐ(ఎం) నాయకులు అమరజీవి బట్టుపల్లి శ్రీనివాస్ ఆశయాలను సాధిద్దామని పట్టణ కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. ఆదివారం పట్టణ కమిటీ సమావేశం నాయకులు గంధ మల్ల మాతయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్ 1 బట్టుపల్లి శ్రీనివాస్ 14వ వర్ధంతి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నిత్యం ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం పోరాట ప్రతినిధిగా బట్టుపల్లి శ్రీనివాస్ ముందుండే వారిని తెలిపారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు కోసం, మౌలిక సదుపాయాల కోసం నిర్వహించిన పలు పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. అతను మృతి చెంది 14 సంవత్సరాలు గడుస్తున్న నేటికీ ప్రజలు మరవకుండా గుర్తుచేసుకుంటున్న విషయాన్ని తెలిపారు.

# ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం..

భువనగిరి:అమృత్ తెలంగాణ: యువత పొగత్రాగుడుకు బానిసలు కాకూడదని, వారి శక్తి, విజ్ఞానం దేశ సంపదని, సరదాగా అలవాటు చేసుకుంటే అది ఒక వ్యసనం లాగ మారి ప్రాణాన్ని, జీవితాన్ని ఛిద్రం చేస్తుందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్చార్జ్ అధ్యక్షులు ముక్తిదా తెలిపారు. శనివారం భువనగిరిలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం పురస్కరించుకొని అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బహిర్గత ధూమపానం నిషేధింపబడిందని, దీనిని అతిక్రమిస్తే రాజ్యాంగం ప్రకారం స్వేచ్ఛా హక్కును కాలరాయటమే అని తెలిపారు. పొగాకును అందరు విడనాడాలని దీనిని మాన్పించటంలో అందరు కృషి చేయాలి అని తెలిపారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ మరియు ఇంచార్జి కార్యదర్శి ఎన్. శ్యామసుందర్ మాట్లాడుతూ పొగ త్రాగటం ఒక మానసిక రుగ్మతన్నారు. దీనిని మానివేయాలంటే తమకు తామే కౌన్సిలింగ్ చేసుకొని పొగ త్రాగే అలవాటు స్వయంగా మానుకోవాలన్నారు. పొగ త్రాగుట వలన అనారోగ్యం పాలై తద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని జీవితమే నష్ట పోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జ్ జి. స్వాతి మాట్లాడుతూ పొగాకుకు బానిసలు కాకూడదని ముఖ్యంగా కాలేజీ విద్యార్థులకు, గ్రామీణ, పట్టణ వాసులలోని యువతకు కౌన్సిలింగ్ నిర్వహించి పొగాకు మాన్పించటంలో కృషి చేయాలని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా మానసిక ఆరోగ్య కార్యాక్రమ అధికారి డా. ప్రీతి స్వరూప్ పొగ త్రాగటం, హుక్కా , పొగాకు నమలడం వంటి వాటికి బానిసలైతే ఎలాంటి అనారోగ్య సమస్యలు మరియు క్యాన్సర్ బాధితులుగా మారే విషయాలపై అవగాహన కల్పించి, జిల్లా



ఆరోగ్య మరియు వైద్య శాఖ ద్వారా జిల్లాలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వి.వి.గౌడ్ మరియు జనరల్ సెక్రటరీ బొల్లేపల్లి కుమార్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జి. శంకర్ లు పొగ త్రాగుట విడనాడాలన్నారు. సంబంధిత చట్టాలను ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. న్యాయమూర్తులు పొగాకు నిర్మూలనకై అవగాహన ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యాక్రమములో పాల్గొన్న పారా లీగల్ వాలంటీర్లకు తగిన ప్రచారం కోసం అందచేశారు. భువనగిరి కోర్ట్ సిబ్బంది, పోలీస్ కానిస్టేబుల్స్ , కక్షిదారులు పాల్గొన్నారు.

# కురుమ సంఘం ఎన్నికలు నిర్వహిస్తాం..

యాదగిరిగుట్ట.అమృత్ తెలంగాణ:తెలంగాణ రాష్ట్రంలో కురుమ సంఘం ఎన్నికలు జరిపించాలని నిర్ణయించామని యాదగిరిగుట్ట కురుమ సంఘం అధ్యక్షుడు కొడే మహేందర్ తెలిపారు. శనివారం, యాదగిరిగుట్ట మండలం చోల్లేరు, కురుమ సంఘం అధ్యక్షుడు తోటకురి యాదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో యాదగిరిగుట్ట కురుమ సంఘం అధ్యక్షుడు కొడే మహేందర్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కురుమ సంఘం ఎన్నికలు జరిపించాలని అందుకు గాను సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. కావున సభ్యులందరూ 100 రూపాయలు సభ్యత్వ నమోదు రుసుము చెల్లించి ఎన్నికల సభ్యత్వం తీసుకోగలరు. ఈ కార్యక్రమంలో గొర్ల కాపరి సంఘం అధ్యక్షుడు కుక్కల కొండ దేవేందర్, తోటకూరి నరసయ్య, గవ్వల భాస్కర్, చిన్న మల్లయ్య, తొండ గురు రవి తోటకూరి శివరాజు, చిన్నం స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# పుష్కర సన్మానంలో జర్నలిస్టులపై చిన్న చూపు

భూపాలపల్లి:అమృత్ తెలంగాణ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమ క్షేత్రం కేంద్రంగా మే 15 నుండి 26 వరకు జరిగిన సరస్వతీ పురస్కారాల విజయోత్సవ సన్మాన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. శనివారం జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ శ్రీధర్ బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ,ఎస్పి కిరణ్ ఖరే సమక్షంలో నిర్వహించిన విజయోత్సవ సన్మాన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులకు ,ఉద్యోగులకు జ్ఞాపకతో పాటు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నప్పటికీ గత రెండు మూడు నెలల నుంచి కాళేశ్వరం కేంద్రంగా సాగుతున్న సరస్వతి పుష్కరాల అభివృద్ధి పనుల మొదలుకొని పుష్కరాలు ముగింపు వరకు ప్రతి కార్యక్రమాన్ని విస్తృతంగా కవరేజ్ చేసిన జర్నలిస్టుల మాత్రము సన్మానానికి దూరం పెట్టారు. కేవలం జర్నలిస్టు మిత్రులు అని చెప్పి మంత్రితో ఫోటో దింపి వదిలేశారు. కనీసం పుణ్యక్షేత్రంలో రెండు,మూడు నెలల నుంచి జరుగుతున్న పుష్కరాల అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం కల్పించి, 12 రోజులపాటు సాగిన పుష్కరాల కవరేజిని రాత్రింబవళ్లు తేడా లేకుండా కవర్ చేసిన జర్నలిస్టులను మాత్రం మంత్రి, జిల్లా అధికార యంత్రాంగం విస్మరించారు. పుష్కర సన్మాన కార్యక్రమంలో ప్రభుత్వం తమ వివక్షతను చాటుకుంది. చివరకు ఉద్యోగులకు, అధికారులకు, నాయకులకు అందించిన ఏ కార్యక్రమాన్ని కూడా జర్నలిస్టులకు వర్తింప చేయకపోవడం పై జిల్లా జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# జూన్ 3 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: వచ్చేనెల జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులపై జిల్లాలోని ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణ, అప్లికేషన్లు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో నిర్వహించే సదస్సులపై రెండు రోజుల ముందుగా ఆయా గ్రామాలకు సమాచారం ఇవ్వాలని, అప్లికేషన్ తో పాటు ఇవ్వాల్సిన పత్రాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు.



ప్రతి గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సదస్సులు నిర్వహించాలని తెలిపారు. సదస్సులు నిర్వహించే చోట హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని, అప్లికేషన్ ఫారాలు ఇతర కావాల్సిన సామగ్రిని అందుబాటులో ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అప్లికేషన్ పూర్తిగా పక్కా సమాచారంతో నింపాలని తెలిపారు. ఆ వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షించాలని స్పష్టం చేశారు. భూములకు సంబంధించి వచ్చే అప్లికేషన్ వివరాలు ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసి దానిలో నమోదు చేయాలని పేర్కొన్నారు. అప్లికేషన్ లు ప్రతి అంశం చక్కగా రాయాలని అప్లికేషన్ స్వీకరించిన తర్వాత దరఖాస్తుదారులకు రిసీవ్డ్ కాఫీ అందజేయాలని, వారి కోసం ప్రత్యేకంగా సిబ్బంది నియమించి రాయించాలని సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేసే సదస్సులను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో రెండు టీములు ఏర్పాటు చేయాలని ఒక టీముకు తహసిల్దార్, మరొక టీంకు డిప్యూటీ తాసిల్దార్ నేతృత్వం వహించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు సదస్సులకు వచ్చే ముందు తమ భూమికి సంబంధించిన పత్రాలను వెంట తీసుకెళ్లాలని కలెక్టర్ చూపించారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ తదితరులు పాల్గొన్నారు.


# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

తొగుట .అమృత్ తెలంగాణ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం అని పిఎసి ఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి అన్నారు. శనివారం మండలం లోని గుడికందుల గ్రామంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో పిఎసిఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి బాధి తులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అంద జేశారు. గ్రామానికి చెందిన చిన్న రాము గారి శివ మ్మకు రూ. 18 వేలు, ఆకుల రచనకు రూ. 12 వేలు, చిన్న రాము గారి చంద్రయ్యకు రూ. 18 వేల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా సీఎం రిలీఫ్



ఫండ్ ఉపయోగ పడుతుందన్నారు. అనుకోకుండా ప్రమాదాల బారిన పడి ఆసుపత్రిలో చికిత్స తీసు కున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ తో ఎంతో సహకా రం అందుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లయ్య, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ బైరా గాడ్, నాయకులు గురువారెడ్డి, భూపాల్ రెడ్డి, ఉప్పరి కమలాకర్, యెహను, రాకేష్, బద్రి తది తరులు పాల్గొన్నారు

# బాలీవుడ్ లో బడా నిర్మాణ సంస్థలో మాళవిక




సినిమా తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. మాళవిక నటించిన ఎన్నో డబ్బింగ్ సినిమాలను తెలుగు ఆడియన్స్ ఇప్పటికే చూసేశారు. మాళవిక ఇండస్ట్రీలోకి వచ్చి ఆల్రెడీ పదేళ్లు దాటుతోంది. పదేళ్ల తర్వాత అమ్మడు ఇప్పుడు తెలుగులో సినిమా చేస్తుంది. మారుతి దర్శకత్వంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ సినిమాలో మాళవిక లీడ్ రోల్ లో నటిస్తోంది. రాజా సాబ్ తర్వాత మాళవికకు తెలుగులో మరిన్ని ఛాన్సులు క్యూ కడతాయని అందరూ అంటున్నారు. ఇదిలా ఉంటే మాళవిక గతేడాది యుద్ర అనే సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. ఇదిలా ఉంటే మాళవిక ఇప్పుడు మరో బాలీవుడ్ సినిమాకు సైన్ చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. రొమాంటిక్ కామెడీ జానర్ లో రూపొందనున్న ఓ భారీ ప్రాజెక్టుకు మాళవిక సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఓ భారీ నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని టాక్ వినిపిస్తోంది.

# రవితేజ.. పర్ఫెక్ట్ పండగ ప్లాన్

మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం తన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇటీవల వరుస అపజయాలతో వెనుకబడ్డ రవితేజ, తన తదుపరి సినిమాలకు చాలా జాగ్రత్తగా స్క్రిప్టులు ఎంపిక చేసుకుంటున్నాడు. మాస్ జాతర అనే హై వోల్టేజ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే, తాజాగా మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఫిలింనగర్‌లో చక్కర్లు కొడుతోంది. రవితేజ కూడా వెంకటేష్ తరహాలో టార్గెట్ సెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల వెంకటేష్ - అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఏ రేంజ్ లో హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వెంకీ కెరీర్ లో బిగ్గెస్ట్ గ్రాసర్ గా 300 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టడం విశేషం. ఈ సినిమా సక్సెస్ కావడానికి కాంబినేషన్ ఒక కారణమైతే రిలీజ్ స్లాట్ మరో ముఖ్యమైన రీజన్. ఇక రవితేజ కూడా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలోకి దిగబోతున్నాడట. సాధారణంగా సంక్రాంతి టాలీవుడ్‌కు బిగ్గెస్ట్ సీజన్. ప్రతి పెద్ద హీరో తన సినిమాను ఈ పండగ సీజన్‌లో రిలీజ్ చేయాలని చూస్తాడు.

ఇప్పటివరకు ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్, చిరంజీవి-అనిల్ రావిపూడి ప్రాజెక్టులు



ఈ ఫెస్టివల్ సీజన్ కోసం లైన్‌లో ఉన్నాయి. ఇప్పుడు ఈ పోటీకి మాస్ మహారాజా కూడా జాయిన్ అవుతుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. సంక్రాంతి సక్సెస్ రేషియోలో ఉన్న అనిల్ ఈసారి చిరంజీవితో వస్తున్నారు కాబట్టి ఆ సినిమాకు పోటీగా నిలవడం అంత ఈజీ కాదు. అయితే రవితేజ కూడా ఓ ప్లానింగ్ తోనే వస్తున్నాడు. తన కొత్త సినిమాను క్లాస్ మేకర్ కిషోర్ తిరుమల దర్శకత్వంలో చేయబోతున్నాడనే న్యూస్ కన్ఫర్మ్ అయింది. కిషోర్ తిరుమల సినిమాలకు యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉంటుంది.

నేను శైలజ, చిత్ర లహరి వంటి ప్రాజెక్ట్స్‌తో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు, రవితేజతో కలిసి ఏ తరహా కథను తీసుకురాబోతున్నాడనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకు రవితేజ మాస్ యాక్షన్ పాత్రలలోనే ఎక్కువ కనిపించాడు. అయితే, ఈసారి మాత్రం ఫ్యామిలీ, ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా ఉండేలా స్క్రిప్ట్‌ను ప్లాన్ చేసినట్లు సమాచారం. దీంతో ఇది సంక్రాంతికి పర్ఫెక్ట్ సినిమా అవుతుందనే ఆలోచనలో ఉన్నారట.

వెంకటేష్ తరహాలోనే మాస్ రాజా కూడా సంక్రాంతి టైమ్ లో సీజన్ కు తగ్గ కాంటెంట్ తో హిట్టు కొట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నాడు. గతంలో దసరా, రామారావు ఆన్ డ్యూటీ లాంటి సినిమాలను నిర్మించిన ఈ నిర్మాత ఇప్పుడు రవితేజ - కిషోర్ ప్రాజెక్టును కూడా గ్రాండ్ గా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. మాస్, క్లాస్ మిక్స్‌గా రూపొందనున్న ఈ సినిమా, సంక్రాంతి రిలీజ్ కోసం ముందుగానే ప్లాన్ చేయబడింది.

# ఎప్పుడు ఏ వైపు నుంచి ఫోటో తీస్తారో తెలీదు!

ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె శరీర తత్వం, దాంతో పాటే వచ్చిన ఇమేజ్‌ని మేనేజ్ చేయాల్సిన అవసరం గురించి మాట్లాడింది. బాడీ ఇమేజ్‌తో తన కష్టాల గురించి ఎప్పుడూ ఓపెన్‌గా చెప్పే నటి సోనాక్షి సిన్హా, తన అధిక బరువు గురించి ఎప్పుడూ ఓపెన్ గా మాట్లాడుతుంది. ప్లస్ సైజ్ తనకు ఎప్పుడూ అడ్డంకి కాదని ధైర్యంగా చెబుతుంది. ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె శరీర తత్వం, దాంతో పాటే వచ్చిన ఇమేజ్‌ని మేనేజ్ చేయాల్సిన అవసరం గురించి మాట్లాడింది. దీని కారణంగా పబ్లిక్ లో గోప్యత విషయమై గందరగోళం నెలకొంటుందని, భారతదేశంలో ఈ విషయంపై జాగ్రత్త వహించాలని సోనాక్షి అంది. అలాగే తాను భారతదేశంలో స్విమ్మింగ్‌ను ఎందుకు ఇష్టపడను?అనే విషయాన్ని కూడా మాట్లాడింది. ఈత దుస్తులను ధరించేటప్పుడు.. ముఖ్యంగా పెరిగే వయసులో నేను ఎల్లప్పుడూ స్పృహతో ఉన్నాను. నేను ముంబయిలో లేదా ఈ దేశంలో ఈత కొట్టను.ఎందుకంటే ఎవరైనా రహస్యంగా ఫోటో తీసి ఎప్పుడు ఎక్కడికి పంపుతారో నాకుతెలియదు. ఇది ఇంటర్నెట్‌లో షికార్ చేయడం నాకు ఇష్టం లేదు. నేను భారతదేశం వదిలి



ఎక్కడికైనా వెళ్లినప్పుడుఈతకొడతాను.అనిస్పష్టంగా చెప్పింది. సినిమాఈ భయంవెనక ఏదోఒకకారణం ఉంటుంది.అలాగే నన్ను బరువుతగ్గాలనిఅమ్మఎప్పుడూ చెబుతూ ఉండేదని, కానీదానికి విరుద్ధంగా చేయడానికి ఇష్టపడేదానిని అని కూడా సోనాక్షి తన మొండితనం గురించి చెప్పింది.చిన్న పిల్లలుగా మనస్తత్వాలు అలా ఉంటాయి. కానీ మా అమ్మ నాకు చెప్పడం మానేసిన రోజునే నా బరువు గురించి నేను ఏదైనా చేయాల్సిన అవసరం ఉందని నాకు అనిపించిందని తెలిపింది.




# బికినీ బ్యూటీ సోనాల్ పర్ఫెక్ట్ టోన్డ్ లుక్



బాలయ్య-బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది సోనాల్ చౌహాన్ పరిచయం అవసరం లేదు. బాలయ్య-బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది. అయితే సక్సెస్ ఉన్నా ఈ భామకు ఏదీ కలిసి రాలేదు. ప్రభాస్ ఆదిపురుష్ చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఈ బ్యూటీ బంగ్లాదేశ్ కి చెందిన ప్రముఖ పంపిణీదారుడు నిర్మిస్తున్న ఓ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీలో ఛాన్స్ కల్పించాడు. థర్డ్ పేరుతో ఈ మూవీ డాలీవుడ్ (బంగ్లాదేశ్) లో విడుదల కావాల్సి ఉంది. అయితే దానికి సంబంధించిన సరైన అప్ డేట్ లేదు. సౌత్ లో అన్ని పరిశ్రమలతో సంబంధాలు ఉన్నా, హిందీ పరిశ్రమను సోనాల్ ఎప్పటికీ వదిలిపెట్టదు. తాజాగా సోనాల్ చౌహాన్ షేర్ చేసిన ఫోటోషూట్ ఒకటి అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. సోనాల్ మతిచెడే బికినీ ఫోటోషూట్ లో టోన్డ్ లుక్ తో ఆకట్టుకుంది. తన కళ్లకు అందమైన బ్లాక్ రేబాన్ ని ధరించి మోడ్రన్ టచ్ ఇచ్చింది. బికినీపై మెస్సీ స్లిప్ ఆన్ డ్రెస్ ధరించిన చౌహాన్ రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. సోనాల్ స్పెషల్ ఫోటోషూట్ వేగంగా యూత్ లోకి దూసుకెళుతోంది. వరుస ఫోటోషూట్లతో గ్యాప్ లెస్ గా సోనాల్ ప్రయత్నం చూసి, తిరిగి టాలీవుడ్ అవకాశాలు కల్పిస్తుందేమో చూడాలి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com